# అమానుషం

సి. ఉమాదేవి

కావలసినవన్నీ సర్దుకుని మా ప్రయాణానికి వచ్చు జెండా ఊపేటప్పటికి మధ్యాహ్నం ఒంటి గంట దాటనే దాటింది.

మా ఆవిడ ఇంకా సణుగుతూనే ఉంది. "మమ్మల్ని మీ వెంట తీసుకెళ్ళని పాపానికి ఏ పెద్దపులో మీ జీపుపైకి లంఘిస్తుం"దని.

"మరీ అలా శాపాలు పెట్టెయ్యకే సుమిత్రా !" అంటూ దిగజారుతున్న గుండెను చిక్కబట్టుకున్నట్టు నటించాను. అయినా ఆడవాళ్ళనూ, పిల్లలనూ వెంట తీసుకెళ్ళటానికి ఇదేమైనా జాలీ టూరా? నా ఫ్రెండ్ ఫారెస్ట్ రేంజర్. అతని ఉద్యోగం అరకులో, కాపురం విశాఖలో. అతని పట్టు వదలించుకోలేక బయలుదేరాను. ఛెవిలో జోరీగలా అతనిది ఒకటే రొద - చతుర్ముఖ పారాయణానికి నాలుగవ సభ్యుడు తక్కువవుతాడని. అతని అంతర్వేదనేమిటో నాకు తెలుసు. నాకూ కాస్త చేతి దురదే వదులుతుందో, చేతి చమురే వదులుతుందో చెప్పలేను గాని, నాలాగే అరకులోయను చాలా ఆలస్యంగా గుర్తిస్తున్న జనావళి మాత్రం అజ్ఞానులని ఘంటాపథంగా చెప్పగలను. నా వాయిదా వాగ్దానాలకు వాత పెట్టి, 'గెస్ట్ హౌస్ రెడీ' అన్న వర్తమానంతో పాటు, జీపును కూడా సిద్ధం చేసుకుని మరీ నామీద దాడి చేశాక, ఇక నా కీ ప్రయాణం తప్పలేదు. కాని టూ ఇన్ వన్‌లా వాళ్ళ కన్సర్వేటరు ఇన్‌స్పెక్షన్‌కు వస్తా నన్నప్పుడే మేము అక్కడకు వెళ్ళవలసి రావడం అతని వృత్తి ధర్మమైనా నాకు మాత్రం శిరోభారమే. పగలంతా ఒక్కడినే తూర్పు కనుమలకు కను లప్పగించాలేమో అని విసుగు కూడా కలిగింది.

నా ఫ్రెండ్ రేంజరు కృష్ణమూర్తి, గార్డు సింహాచలం, ఇక డ్రైవరు ఎలాగూ ఉన్నా డనుకోండి. ఇటు ఆరీన్ రాజా లాంటి కంట్రాక్టరు ప్రకాష్, అటు తన మందులతోటే గాక తన జోకులతో కూడా అందరి ఆరోగ్యాన్ని రక్షించే డాక్టర్ రామచంద్ర, మాకోసం అరకులోనే ఎదురుచూస్తుంటారు. ఇంతకూ కన్సర్వేటరు అరకులోయ చేరుకునేలోపలే చేరుకోవా లనుకున్నాము. టనెల్స్ ద్వారా రైలు ప్రయాణం చేయాలని ఉన్నా కొండ ప్రాంతంలో ఇన్‌స్పెక్షన్‌కు జీపు లేనిదే కష్టమని, మా ప్రయాణానికి జీపునే ఎంచుకున్నాము.

జీపు డ్రైవరు మా ఇంటి ముందుకు తెచ్చి ఆపాడు జీపును. రమ్మన్నట్లుగా చేయి ఊపాడు కృష్ణమూర్తి. 'అయితే ఇక నాదేనా ఆలస్యం' అనుకుంటూ మా ఆవిడను పిలిచా, కాస్త సెండాఫ్ అయినా ఇస్తుందేమో అని.


నా పిలుపుకు సమాధానంగా అలక, చిరునవ్వు కలగలిపి మా ఆవిడ పెద్ద కారియర్ ఒకటి తెచ్చి డ్రైవర్ చేతి కందించింది. 'అది అందరికీను' అంటూ కళ్ళతోనే నాకు సైగ చేసింది. సుమిత్ర సమయస్ఫూర్తికి నాకు ముచ్చటేసింది. ఇలా మన సెరిగిన అర్ధాంగికి అరకులోయ నుంచి ఏం తెచ్చివ్వాలా అని ఆలోచనలో పడ్డాను. పుట్టతేనా, చెట్ల ఫలాలా, సీతాఫలాలా, జీడిమామిడి పళ్ళా?

"సార్ ! కారియర్ జీపులో పెట్టాను."

డ్రైవర్ పిలుపుకు ఈ లోకంలోకి వచ్చాను.

"సరే సరే ! ఈ జిప్ బాగ్ కూడా పెట్టెయ్యవోయ్"

అని నా బాగ్ అతని కందించేసి, సాధ్యమైనంత సన్నగొంతుతో అడిగాను మా ఆవిడను - "ఏం కావాలోయ్ అరకునుంచి?"



అంటూ. ఆవిడా అదే మంద్రస్థాయిలో - "చావ చిరిగిపోయింది, వీలైతే పులి చర్మం..." అంటూ నవ్వును బుగ్గలలోనే నొక్కుకుంది.

సరేలెండి, నాకు కాస్త పిరికితనం అని మా ఆవిడ అనుమానం... ! అహ అనుమానమే సుమండీ ! నాకు బల్లులు, బొద్దింకలంటేనే అలర్జీగా ఉంటుంది. ఇక చేతుల్లో ఇమడకుండా పిల్లులు, కుక్కలు, కుందేళ్ళ లాంటివి

గెంతుతుంటే అసహ్యం కొంత, బెదురు ఒకింత అందుకే ఇంట్లో కుక్కపిల్లను పెంచుకోవాలని మా చిన్నబ్బాయి బాబ్జీ ముచ్చటపడ్డా, 'కుక్కను పెంచితే ఖబడ్దార్' అన్న నా శిలాశాసనంతో వాడిని అశక్తుడిని చేశాను. శ్రీమతి చూపుల వీడ్కోలు అందుకుని జీపు ఎక్కి పోనిమ్మన్నాను.

విశాఖ పొలిమేరలు దాటి అరగంట అయింది. అలోపల ఇన్‌స్పెక్షన్ కవర్ అవుతున్న ఏరియా, ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్‌కు అలాట్ చేసిన నిధుల విడుదల గురించి చర్చించసాగాడు కృష్ణమూర్తి. కన్సర్వేటర్‌కు మౌఖికంగా కూడా ఎలా వివరాలు విన్నవించాలో కాస్త రిహార్సల్ వేసిన మాట కూడా వాస్తవమే. నాకు అసహనంగా ఉంది.

జీపు మంచి స్పీడులో వెళుతోంది. దారి సుగమంగానే ఉంది. రోడ్డుమీద జనం ఎండ కారణంగా పలుచబడ్డట్లున్నారు. ఒడుదుడుకులు లేని ప్రయాణం హాయిగా ఉంది. పక్కన సుమిత్ర ఉంటే మాటల గలగలలతో, నవ్వుల తుళ్ళింతలతో కొండ వాగులను తలపించేది.

ఘాట్‌రోడ్ మొదలైంది. వేగాన్ని తగ్గించి జీపును జాగ్రత్తగా నడుపుతున్నాడు డ్రైవర్. చాకచక్యంగా మెలికలు తిరిగిన రోడ్డుపైన మెలకువగా నడుపుతున్నాడు. ఏమాత్రం అజాగ్రత్త, ఏమరుపాటు చూపినా అగాధాల అంచులు చూస్తాము.

· అనంతగిరి ఘాట్ సెక్షన్ చేరుకునేసరికి వాయునందనుడు ఆహ్వానం పలుకుతున్నాడు. కొండ తొలిచి మలచిన ఆంజనేయస్వామికి నమస్కరించి మా ప్రయాణం కొనసాగించాము.

కొండలన్నీ పచ్చదనం పులిమిన ట్లున్నాయి. రకరకాల లతలు, చెట్లు ఎన్నడూ చూడని రకరకాల పూలతో చూడముచ్చటగా ఉన్నాయి. వింతైన ఆకృతులతో ఉన్న పూలు, ఆకులు కలెక్ట్ చేసుకుంటే బోటనీ విద్యార్థులకు ప్రాక్టికల్స్‌కు కొదవ ఉండదు. సూర్యాస్తమయ అరుణకాంతులు సోకి పసిడితనంతో తళతళలు విరజిమ్ముతూ తరులతలు వింజామరలు వీస్తున్నాయి. పిల్లగాలులు ఊహాలోకంలోకి నడిపిస్తున్నాయి. 'ఆకులో ఆకునై, పువ్వులో పువ్వునై, నునులేత రెమ్మనై' అనుకుంటూ అక్కడే ఉండిపోవాలనిపించింది. కృష్ణశాస్త్రిగారు మనసులో మెదలి నా చిరునవ్వులు బయట పడ్డట్టున్నాయేమో, కృష్ణమూర్తి నా భుజంపైన చరుస్తున్నాడు.

"ఎందుకోయ్ నీలో నువ్వే నవ్వుకుంటున్నావ్?" అంటూ.

"ఏం లేదు, నీవేమో నీ ఇన్‌స్పెక్షన్ గొడవలో పడ్డావు, మరి నేను ఊహాలోకంలోకి" అంటూ ఆగిపోయాను.

అతను నాకు సారీ చెప్పి నా గురించి, నా పిల్లల గురించి అడిగాడు. తనూ తన సంసారం గురించి చెప్తూ పిల్లలు పెరిగాక వాళ్ళ చదువుకోసం ప్రస్తుతం తన కుటుంబం నుంచి దూరంగా ఉన్నట్లు చెప్పాడు. పాపం కుటుంబం విశాఖలో, అతను అరకులో పూర్తా మార్కెట్‌లో పరిచయం. స్నేహంగా మారినా కుటుంబ విషయాలు అంతగా చెప్పుకోలేదు. కాని ఈ ప్రయాణంలో కావలసినంత తీరిక దొరకడంతో ఇద్దరం ఫామిలీ కబుర్లలో పడ్డాము.

"మరి ఆ కొండల నడుమ భోజనానికి ఇబ్బంది కదా?" అని నే నంటే - "ఏం చెయ్యను? మొన్నమొన్నటిదాకా మా అమ్మ ఉండేది నా దగ్గర. ఆవిడ వెళ్ళిపోయింది."

"ఎక్కడికి?" అప్రయత్నంగా అడిగేశాను.

అతని ముఖంలో నల్లని మబ్బులు ఆవరించాయి. నా కర్థమైంది అతని బాధ. "అయ్యో! అనవసరంగా వేశానే ఈ ప్రశ్న". అని నొచ్చుకుంటూ అతనికి ఓదార్పు పలకాలనుకుంటూ భుజంమీద చేయి వేయబోయాను.

అంతలో - 'క్రీచ్‌చ్...' మన్న బ్రేక్‌తో నా చేయి బాలన్స్ తప్పి జీపు అద్దమీద పడి 'టపీ' మంది.

'ఏమైందో' అనుకుంటూ రోడ్డుపైకి దృష్టి సారించాను. చిన్న కుక్కపిల్లేమో కుయ్యో, కుయ్యోమని అరుస్తూ, కాళ్ళీడ్చుకుంటూ పోతోంది. జీపు స్టార్ట్ చేయబోతున్న డ్రైవరును హఠాత్తుగా ఆపమన్నాడు కృష్ణమూర్తి. నాకేం అర్థం కావటంలా. కోడి కాదు, సీమపంది కాదు. ఆఫ్టరాల్ ఓ కుక్కపిల్ల. అదీ ఊరకుక్క. దాని కెవరూ డబ్బులు కూడా వసూలు చెయ్యరు. జీపు దిగి, కుంటుకుంటూ వెళ్తున్న కుక్కపిల్లను జీపులోకి తెచ్చాడు కృష్ణమూర్తి.

నాకు ఒళ్ళంతా కంపర మేస్తోంది. అది భయంతో కడుపును బయటకు లోపలకు కదుపుతూ వణకుతోంది. కృష్ణమూర్తి దాన్ని ఒళ్ళో కూర్చోబెట్టుకుని జీపును పోనిమ్మన్నాడు. కుక్కపిల్ల కాలును నెమ్మదిగా నిమరసాగాడు. అదేమో దూకెయ్యాలని ప్రయత్నిస్తోంది. అతనేమో దాన్ని గారాబంగా బుజ్జగిస్తున్నాడు.

'ఇదెక్కడి దరిద్రంరా!' అనిపించింది నాకు. ఇక ఉండబట్టలేక - "ఇక వదిలెయ్యరాదూ, హాయిగా దానికి పరిచయ మున్నచోటికే వెళుతుంది. మన వెంట ఇదెందుకు చంకలో పిల్లిలా" అన్నాను.

"చంకలో పిల్లేమిటి? చంకలో కుక్క అను. అయినా, అదేమిటి ఆముదం తాగిన వాడిలా ముఖం పెట్టావు?" అన్నాడు నన్ను చూసి.

"నా కీ కుక్కలు, పిల్లుల్లంటే ఎంత జుగుప్సో" అని ఇంకా ఏదో చెప్పబోయాను.

"అలా అనకు. నా ఎక్స్‌పీరియన్స్ వింటే జంతువుల పట్ల మనే మెంత అమానుషంగా ప్రవర్తిస్తామో నీవు తెలుసుకుంటావు. నీలాగే నాకూ కుక్కలంటే అసహ్యంగా ఉండేది. కాని నాలోని అసహ్యాన్ని పోగొట్టి ఆప్యాయత నింపింది మా బాబు ధీరజ్!"

అమ్మో! కుక్కలమీద ఓ ఉపన్యాసం దంచేస్తాడేమో అనుకున్నాను. నాకు విసుగ్గా ఉంది.

"చెప్పండి సార్!" అంతవరకు మౌనంగా వెనుక సీటులో కూర్చున్న గార్డు సింహాచలం ఆత్రతగా అడిగాడు.

అరకులోయ వచ్చేసింది. అప్పటికి టైమ్ చూస్తే ఆరు దాటుతోంది. గెస్ట్ హౌస్ రిజర్వ్ చేసుకున్నందుకు ఇబ్బందేమీ లేకుండా స్నానానికి నీరు, ప్రాణానికి తేనీరు సిద్ధమయ్యాయి.

స్నానా లయ్యాక సుమిత్ర ఇచ్చిన కారియర్ విప్పాము. పులిహోర, సాంబారు, పాయసం, పెరుగన్నం, గోంగూర పచ్చడి. ఆంధ్రుడికి అంతకంటే ఏం కావాలి? నేను, నా ఫ్రెండే గాక, సింహాచలం, డ్రైవరు కూడా కడుపునిండా తినగలిగారు. మేము అనుకున్న దానికంటే ఒక్క రోజు ముందుగా వచ్చాము. అందుకే కంట్రాక్టర్, డాక్టర్ పేక ముక్కలతో స్వాగతం పలకలేదు. ఈ కృష్ణమూర్తి కబురైనా పెడ్తాడా? ఎక్కడి కెళ్ళాడు? అదిగో అక్కడ కుక్కపిల్లకు పెరుగన్నం పెడుతున్నాడు. ఆ ప్రయాణ పరిచయానికే అది అతన్ని చూసి తోకను తెగ ఆడించేస్తోంది. జన్మస్థలం మరిచిందేమో జీపులోనే గిరికీలు కొడుతోంది.

"నువ్వు. జీపులోనే కూర్చుని దానితోడిదే లోక



మనుకుంటే మన పారాయణం కష్టం.'' గుర్తు చేశాను.

''ఊహూ...'' అతనిలో పెద్ద ఆసక్తి కనపడలేదు.

''పోనీ మీ ఇల్లు దగ్గరే కదా ! వదిలేసి రమ్మని డ్రైవరుకు చెప్పు. మీ ప్యూను చూసుకుంటాడులే.'' అతన్ని చిన్నబుచ్చడం ఇష్టంలేక చెప్పాను. ఏం లాభం ! నా కంఠశోష మిగిలింది.

చలికి పుల్లలు పేర్చి వెచ్చగా చలిమంట వేశారు గార్డు, డ్రైవరు. నేను అరమరికలు లేకుండా వాళ్ళ దగ్గర కెళ్ళి కూర్చున్నాను. కుక్కపిల్ల నెత్తుకుని కృష్ణమూర్తి కూడా వచ్చాడు. దాని కాలికి వెచ్చగా తన అరచేతిని కాపడం పెట్టేసరికి అది హాయిగా నిద్రపోయింది కృష్ణమూర్తి పక్కనే.

''ఇక ఇప్పుడు చెప్పండి సార్ !'' సింహాచలం ఆత్రతగా అడిగాడు. అతని ఆసక్తి నాకేం రుచించలా.

ఈమిటో ఈ కుక్కల కథలు ! ఈ కుక్కపిల్లే రోతగా ఉంటే ఇంకా వాటి వంశవృక్షమంత ఎవరిక్కావాలి? అయినా తప్పలేదు.

కృష్ణమూర్తి ప్రారంభించాడు.

''ఆ రోజు నా కింకా బాగా గుర్తు. పొద్దుటే బాగా ముసురు పట్టేసింది. ఎడతెగని వర్షం. అరకు వాతావరణం అసలే అంతంతమాత్రంగా ఉన్న అమ్మ ఆరోగ్యాన్ని దిగజార్చుతంతో, వైజాగ్‌కు తీసుకువచ్చాను. ఈ వాన కారణంగా ఉబ్బసంతో ఊపిరి ఆడక అమ్మ తెగ దగ్గుతోంది. ఆమె దగ్గు చూడలేక కాపడం పెట్టమని మా శ్రీమతిని పురమాయించి, అమ్మకు వెచ్చని రగ్గు కప్పాను.

''కురిసి కురిసి నీరసపడినట్లు తన ప్రతాపాన్ని సాయంత్రానికి కొంచెం సడలించాడు వానదేవుడు. అయినా తుంపర పడుతూనే ఉంది. బడికి వెళ్ళిన మా బాబు ధీరజ్ రిక్షాలో వచ్చినా తడిసి ముద్దయిపోయాడు.

''లోపలికి త్వరగా రా ధీరజ్ !'' అని కేకేశాను, కుర్చీలోనుంచే.

★ విలియమ్ షేక్స్‌పియర్, 'డాన్ క్విక్సాట్' రచించి ప్రసిద్ధి చెందిన స్పెయిన్ రచయిత సెర్వాంటిస్ - ఇద్దరూ ఒకే రోజున అంటే ఏప్రిల్ 23, 1616లో మరణించారు. ఒకే సంవత్సరం, ఒకే నెల, ఒకే తేదీ కాని ఒకే వారం కాదు. కారణం 17వ శతాబ్దంలో ఇంగ్లాండు జూలియన్ పద్ధతి కాలెండర్‌ను, స్పెయిన్ గ్రిగోరియన్ పద్ధతి కాలెండర్‌ను అనుసరిస్తూ ఉండేవి. ఈ రెండు పద్ధతుల కాలెండర్‌లకు పది రోజుల వ్యత్యాసం ఉండేది.

★ వాల్టడిస్నీ, ఎర్నెస్ట్ హెమింగ్వే, రాబర్ట్ హిల్లర్, సోమర్ సెట్ మొదలైన రచయిత దర్శకులు రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో అంబులెన్స్ డ్రైవర్లుగా పనిచేశారు.

★ ఒరిజినల్ ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీలో 'సెట్ [SET]' అనే ఒక పదానికి 23 పేజీల వివరాలు ఉన్నాయి.

జాగృతీకిరణ్

ఊహూ, వాడు లోపలకు రాలా ! వా డెందుకో జాప్యం చేస్తున్నట్లుంది.

''త్వరగారా. తల తుడుచుకుందువుగాని'' అని గట్టిగా పిలవడంతో మెల్లగా లోపలకు వచ్చాడు. ఒక చేతిలో బాగ్ సరే. మరో చేతిలో చిన్న కుక్కపిల్ల.

''ఏయ్ ! ముం దా కుక్కని బయటే వదిలేసిరా'' అని గట్టిగా అరిచాను.

కుక్కపిల్లను సంబరంగా నిమురుతున్నాడు వాడు, నా మాట వినిపించుకోనట్లు.

నాకు కాస్త కోపం వచ్చింది. అమ్మ కూడా లేచి దగ్గుతోంది.

''అసలే నానమ్మకు బాగాలేదు. ఈ కుక్కపిల్లేమిటి కుయ్యోమంటూ.''నా బాధ నాదే. నా మాటలు నావే.

వాడేమో వంటింట్లోకి చేరి మెల్లిగా వాళ్ళమ్మ నేదో అడుగుతున్నాడు. ఆమె వాడి ముచ్చట కాదనలేక వాడితో పాటు ఆ కుక్కపిల్లకూ కొన్ని పాలు పోసింది ఓ కొబ్బరి చిప్పలో. ఆ కుక్కపిల్ల ఆత్రతగా పాలన్నీ తాగి, తీగలా అటూ ఇటూ సాగి ఎగురుకుంటూ, గెంతుకుంటూ నా కాళ్ళ దగ్గరకు వచ్చి నాకసాగింది. నాకు కుక్కలంటే అసలే కంపరం. విదిలించే పారేశాను.

లోపల వా డేదో తింటున్నట్లున్నాడు. మెల్లగా తలుపు తీసి కుక్కపిల్లను బయటకు తోసేశాను. మా అబ్బాయి బిక్కముఖం కాస్త బాధ కలిగించినా - ''ఈ కుక్కతో వేగలేంరా మనం, అంతా అశుభ్రం చేసేస్తుంది'' అన్నాను.

''లేదు నాన్నా ! ఇది మంచి కుక్కపిల్ల. నా ఫ్రెండ్ ఇచ్చాడు.'' అభ్యర్థన, సంజాయిషీ కలగలిపి చెప్తున్నాడు వాడు.


వాడి మాటలు నే నసలు పట్టించుకోలా. అయితే మరో అరగంటలో నా పట్టు వదులుకోవలసి వచ్చింది. కుక్కపిల్ల తలుపును తెగ గీకుతోంది. పైగా 'కుయ్యో కుయ్యో' మంటూ ఒకటే అరుపులు.

తిట్టుకుంటూనే తలుపు తీశాను. దాని గొంతుకు బ్రేక్ పడి మా అబ్బాయి చుట్టూ తోక ఊపుతూ తిరగసాగింది. అది నాకుతుందేమో అని భయం. రేబీస్‌ను తలచుకుంటే భయ మేసింది. ఆ రాత్రి మా అబ్బాయి, కుక్కపిల్ల నిద్రపోయాక మా శ్రీమతి సలహా అడిగాను - 'ఈ అనుకోని అతిథి నేం చెయ్యాలా?' అని. ఎంతైనా తల్లి కదూ - ''బాబు మనసు నొచ్చుకుంటాడు. కుక్కను తీసుకెళ్ళి యాంటీరేబీస్ వాక్సినేషన్ చేయించుకుని రండి'' అంది. ఆ విధంగా మొదలైంది నాకు శునక సేవ. మా బాబు కూడా చక్కగా దాన్ని ఆడించడం, మంచి అలవాట్లు నేర్పాలని బయట తిప్పడం. ఆఖరుకు షేక్‌హ్యాండ్ కూడా నేర్పించి మురిసిపోతున్నాడు.

''చదువును అశ్రద్ధ చేయకు ఈ కుక్క ధ్యాసలో పడి !'' అనే నా దబాయింపులకు వాడు కాస్త జడిసి బాగానే చదువుతున్నాడు. కుక్కపిల్లకు చలేస్తుందని చిన్న చిరిగిన జంబుఖానా పరిచాడు. నేను తెచ్చిచ్చిన చెయినను కూడా వేశాడు దాని మెడకు. అది చెయినను ఈడ్చుకుంటూ ఇల్లంత తిరిగేది. తెల్లారక ముందే దాని అరుపులకు లేచేవాళ్ళం. అలారం అక్కర్లేదనుకుంటూ మా శ్రీమతి మురిసిపోయేది.

ఒక రోజు పొద్దుట మా అమ్మ ఇక దగ్గటానికి కూడా శక్తిలేక ఒకటే ఆయాసపడిపోతోంది. డాక్టరును పిలుచుకుని వచ్చాను నేను. ''జబ్బుకన్నా వయసు పైబడడంవల్ల ఆవిడ కోలుకోలేకపోతోంది'' అని. ఏవో మందులు రాసిచ్చాడు. డాక్టరు రాసిచ్చిన మందులు కొనుక్కుని ఇంట్లో అడుగు పెట్టానో, లేదో మా బాబు చేతుల్లో పుస్తకాలేవీ లేవు. పైగా కుక్కపిల్ల ముందు దిగాలుపడి కూర్చుని చూస్తున్నాడు. ఏమైందో అని నేనూ చూశాను. కుక్కపిల్లను బయటకు షికారుకు తీసుకెళ్తే వేరే పెద్దకుక్క వెంటపడి పట్టి పీకిందట. నడుము దగ్గర కండ ఊడిపోయి వేలాడుతోంది. లేవలేక నడవలేక ఒకటే అరుస్తోంది.

'అసలే దగ్గి దగ్గి అమ్మ అలసినట్లు పడుకుంది. దీని గోల ఒకటి' అనుకుంటూ నేను ఆ రాత్రి మా బాబును, వాడితో బాటే వాడి కుక్కను



వినుక్కుంటూ పడుకున్నాను. "మందు వేయిద్దాం నాన్నా!" అని అడిగిన మా బాబును - "అబ్బ కాస్త పౌడర్ చల్లరా. నీ జీవకారుణ్య సేవతో నన్ను చంపుతున్నావు" అని కసురుకున్నాను.

వాడు బిక్కముఖం వేసి, నెమ్మదిగా వెళ్ళి పడుకున్నాడు. కాసేపు వెక్కుతున్నట్టు అనిపించింది. అయినా చిన్నపిల్లాడు కదా నిద్ర కాగలేక నిద్రపోయినట్లున్నాడు ఏడుపు ఆపి. కుక్కపిల్ల మాత్రం తెగ మూలుగుతోంది. దాని ఏడుపు, రొద భరించశక్యంగా లేవు. మూలుగు వినపడకుండా చెవులకు దిండు నదిమి పడుకున్నాను. 'అమ్మయ్య' కుక్క మూలుగుడు వినిపించడం లేదు. హాయిగా నిద్ర పట్టేసింది.

ఒళ్ళు విరుచుకుంటూ తెల్లారి లేచేసరికి మా బాబు ముక్కూ ముఖం కందిపోయి వెక్కి, వెక్కి ఏడుస్తున్నాడు. మా అబ్బాయిని ఓదార్చేసరికి తలప్రాణం తోకకు వచ్చింది. ఆఖరుకు ఒక్క కసురు కసిరాను. "వెధవ ! పోతే పోయింది, మరో కుక్కపిల్లను కొనుక్కుందాంలే, ఇక ఏడవకు" అంటూ వాడు బాధమరచి కాకపోయినా నా కోపానికి జడిసి కన్నీరు ఆపుకున్నాడు అతికష్టంమీద. పది రోజులదాకా వాడు చదువులో కూడా వెనకబడ్డాడు. ఆ తరువాత మామూలుగా పుస్తకాలు తీసి శ్రద్ధ చూపసాగాడు.


ఒక రోజు వా డటు బడికి వెళ్ళగానే నేనూ తయారవుతున్నాను కాంప్‌కు వెళ్ళాలని. అంతలోనే మా ఆవిడ బిగ్గరగా ఏడుస్తూ నా దగ్గరకు పరుగెత్తింది. కారణం ఊహామాత్రంగా మెదలి హడలిపోతూ, కాస్త అనుమానంగానే మా అమ్మ మంచంవేపు కదిలాను. నా నవనాడులు క్రుంగిపోయాయి. గుండె బరువంటే ఏమిటో అప్పుడే తెలిసింది నాకు. ఏడుపు ఉండలా ఎగిసి గొంతు కడ్డంపడి బిగుసుకుపోయినట్లయింది. కొడుకుగా నా తదుపరి కర్తవ్యం నిర్వికారంగా నెరవేర్చసాగాను. మా ఆవిడ స్కూల్ నుంచి బాబును తీసుకు వచ్చేసింది.

"నీకు నానమ్మ లేదురా బాబూ !" అంటూ వాడిని అక్కున చేర్చుకున్నాను. పొద్దుటినుంచి ఉగ్గబట్టుకున్న దుఃఖం మా బాబును చూడగానే వశం తప్పింది. వాడు వాళ్ళ నానమ్మతో ఆడిన ఆటలు, పాటలు గుర్తుకొచ్చి మనసంతా కలచివేసినట్లయింది. ఆరేళ్ళ వయసు వాడిది. నా దుఃఖాన్ని అర్థం చేసుకోగలడో, లేదో అనుకున్నాను. అయినా వాడు తన చిట్టి చేతులతో నా కళ్ళు తుడిచి - "ఏడవకు నాన్నా మరో నానమ్మను కొనుక్కుందాం" అన్నాడు ఓదార్పుగా.

కృష్ణమూర్తి చెప్తున్నది వింటున్న మేమంత ఉలిక్కిపడ్డాము. నుదుట పట్టిన చెమట నద్దుకుని కృష్ణమూర్తి మళ్ళీ చెప్పసాగాడు. "నా ప్రవర్తన పట్ల నాకే అసహ్యం వేసింది. వాడు అనుబంధం పెంచుకున్న కుక్కపిల్ల నా కంటికి ఏమాత్రం ప్రాణమున్న జీవిగా కనబడలేదు. మానవుడిని. అయితేనేం, కుక్కపిల్ల చావుబ్రతుకుల్లో ఉన్నా చెవులు మూసుకుని, దాని మూలుగు నిలిచిపోయిం దనుకుని హాయిగా నిద్రపోయాను. కాని దాని గుండే ఆగిం దనుకోలేదు. అమానుషంగా ప్రవర్తించాను ఆ రోజు. మా బాబు ఈ రోజు తెలియక అమాయకంగా అన్నా నాకు ఒక విధంగా జ్ఞానోదయమైందనే చెప్పాలి. నెల తిరిగేలోగా చక్కటి, తెల్లని 'పామేరియన్' డాగ్‌ను వాడి చేతి కప్పగించాక గాని నాకు ఉపశమనం కలగలేదు. మా బాబు తన కుక్కపిల్ల ట్రెయినింగ్‌తో నన్ను మురిపించి, మరిపించసాగాడు."

కృష్ణమూర్తి కన్నుల్లో తడి లీలగా మెరుస్తోంది.

అతను చెప్పిందంత విన్నాక - 'మానవులమైన మనం ఎంత అమానుషంగా ప్రవర్తిస్తామో అర్థమైంది. ఆ క్షణం కుక్కపిల్లేం కర్మ, పులిపిల్ల దొరికినా తీసుకెళ్ళి పెంచుకోవాలనిపించింది. ప్రేమగా నేనూ కుక్కపిల్లను నిమరసాగాను - "నాతో వస్తావా పప్పీ?" అంటూ. ★




# వీధి దీపం

- వడ్లమూడి దుర్గాంబ

ఎడారిలో మోడుకు పూసిన ఒంటరి
శిఖరాగ్ర పుష్పంలా
ఎలక్ట్రిక్ పోల్ చివర వెలుగుతున్న బల్బు
వీధి మోహాన్ని ముత్తయిదువను
చేస్తుంది.

రోడ్డు సముద్రంలో చీకటి వరదై
ప్రవహించినపుడు
వీధి దీపం దిక్సూచి అవుతుంది.

కను రెప్పలపై నిద్రాభారాన్ని
మోసుకుంటున్న బాటసారి
కాంతిని తాగి కాసేపు తెప్పరిల్లుతాడు.
వీధే ఇల్లయిన నిశీధి ప్రాణులకు వీధి
దీపం
వెలుతురు ముక్కలు కత్తిరించి
ఒంటికి చుడుతుంది.

అంతులేని శూన్యానికి ఆదిలా ఉన్న వీధి
మన మనోవీధిని ప్రతిబింబించినపుడు
వీధి దీపం తళుక్కున మెరిసే
ఆశా నక్షత్ర మవుతుంది.

అప్పుడు
కాంతి కోసం ఆత్మలను త్యాగం చేసుకునే
ఆదర్శ పురుషులై
బయల్దేరిన దీపపు పురుగుల్లో మనం
కూడా ఒకర మవుతాం!